# సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో బల్దియా భేష్

- దేశంలోని 100 నగరాల జాబితాలో 4వ స్థానం
- మార్చి మొదటి వారంలో ఫైనల్ రిజల్ట్

వరంగల్, ఫిబ్రవరి 26 : స్వచ్ఛ సర్వేక్షన్–2024 పోటీల్లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ కేటగిరీలో గ్రేటర్ కార్పొరేషన్ దూసుకుపోతున్నది. 100 నగరాల జాబితాలో బల్దియా ప్రస్తుతం 4వ స్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పోటీల్లో తెలంగాణ నుంచి గ్రేటర్ వరంగల్ ముందంజలో ఉంది. మొదటి, రెండు స్థానాల్లో విజయవాడ, విశాఖపట్నం నగరాలు ఉండగా, మూడో స్థానంలో మహారాష్ట్రలోని పింప్రి చించ్వాడ్ నగరం ఉంది. ఇప్పటి వరకు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో 33,833 మంది నగరవాసులు గ్రేటర్ కార్పొరేషన్ అందిస్తున్న సేవలపై సానుకూలంగా తమ అభిప్రాయాలు తెలిపారు. మార్చి మొదటి వారం వరకు సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇచ్చే అవకాశం ఉంది.

**ప్రజలు ఫీడ్ బ్యాక్‌లో పాల్గొనాలి..**
**- మేయర్ గుండు సుధారాణి**

స్వచ్ఛ సర్వేక్షన్–2024 పోటీల్లో గ్రేటర్ కార్పొరేషన్ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ఎంతో దోహదపడుతుంది. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో నగరవాసులు పాల్గొని గ్రేటర్ అందిస్తున్న సేవలపై స్పందన తెలపాలి. పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొని వరంగల్ నగరం తొలి స్థానంలో ఉండేలా సహకరించాలి.

**ఇదే స్ఫూర్తి కొనసాగించాలి..**
**- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**

సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో పౌర స్పందన చాలా బాగుంది. నగర ప్రజలు ఇదే స్ఫూర్తి కొనసాగించాలి. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంక్ వచ్చేలా దోహదపడాలి.



కాశీలో స్థానిక అధికారులతో మాజీ ఎమ్మెల్యే చల్లా దంపతులు

## కుంభమేళాలో మాజీ ఎమ్మెల్యే చల్లా దంపతులు

పరకాల, ఫిబ్రవరి 26 : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో చల్లా ధర్మారెడ్డి, జ్యోతి దంపతులు పుణ్య స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారణాసిలోని కాశీవిశ్వేరుడిని దర్శించుకుని మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న శివ పార్వతుల శోభాయాత్రలో పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలి మృతి



మల్లమ్మ(ఫైల్)

శాయంపేట, ఫిబ్రవరి 26 : శతాధిక వృద్ధురాలు మృతి చెందిన ఘటన మైలారంలో జరిగింది. గ్రామానికి చెందిన జక్కుల మల్లమ్మ(106) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, 28 మంది మనుమళ్లు, మనుమరాళ్లు, ముని మనుమరాళ్లు ఉన్నారు.

## నేడు డయల్ యువర్ వరంగల్-1 డీఎం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 26 : వరంగల్–1 డిపోలో ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 27న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ల ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలపాలని కోరారు. ఆయా రూట్లలో ఏమైనా సమస్యలు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు 99592 26047 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 26 : ఎల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్లాపూర్‌లో జాతీయ రహదారి పనుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# టెన్ పర్సంటేజ్ ఇస్తేనే చెక్కు క్లియరెన్స్

- పైసల మంత్రి అనుచరుల ‘బీ’ ట్యాక్స్ దందా
- పెండింగ్‌లో రూ.30 కోట్ల విలువైన బల్దియా చెక్కులు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు




వరంగల్, ఫిబ్రవరి 26 : ఫిక్స్ చేసిన ‘టెన్’ పర్సంటేజ్ ఇస్తేనే చెక్కులు క్లియర్ అవుతాయి. ఇవ్వకపోతే నెలల తరబడి పెండింగ్‌లో ఉంటాయి. దీంతో పైసల మంత్రి అనుచరులు ఫిక్స్ చేసిన ‘బీ ట్యాక్స్’ ముట్టజెప్పి బిల్లులు క్లియర్ చేసుకునేందుకు కాంట్రాక్టర్లు హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. రెండేళ్లగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేందుకు మూడు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రూ.187కోట్లు విడుదల చేసింది. వాటికి సంబంధించిన చెక్కులకు సెక్రటేరియట్‌లోని రెవెన్యూ శాఖ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. బల్దియా ఇప్పటికే సుమారు రూ.30కోట్ల పెండింగ్ బిల్లులకు చెక్కులు రాసింది. ఆయా చెక్కులను బల్దియా కాంట్రాక్టర్లు వరంగల్ ట్రెజరీలో జమ చేశారు. వాటి క్లియరెన్స్ కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే అక్కడ కాంట్రాక్టర్లకు దిమ్మ తిరిగే పర్సంటేజ్ ఫిక్స్ చేయడంతో లబోదిబోమంటున్నారు. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రెండేళ్లు పెండింగ్‌లో ఉండడం, ఇప్పుడు బిల్లులు క్లియర్ చేసే సమయంలో పర్సంటేజ్ పేరిట పెద్ద మొత్తంలో దండుకోవడంతో కాంట్రాక్టర్లకు దిక్కుతోచడం లేదు. ఏళ్లుగా ఎదురు చూస్తున్న బిల్లుల క్లియరెన్స్ కోసం మంత్రి అనుచరులు ఫిక్స్ చేసిన పర్సంటేజ్ చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. పర్సంటేజ్ ముట్టజెప్పకుంటే చెక్కు క్లియర్ చేసే పరిస్థితి లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

**మంత్రి అనుచరుల దందా..**

సెక్రటేరియట్‌లో పైసల మంత్రి అనుచరులు యథేచ్ఛగా బీ ట్యాక్స్ పేరిట పర్సంటేజ్ దందా చేస్తున్నట్లు బల్దియా కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. టెన్ పర్సంటేజ్ ఫిక్స్ చేసి మరి వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ముందు చెల్లిస్తేనే చెక్కు క్లియర్ అవుతుందని బాహాటంగా చెబుతున్నట్లు సమాచారం. అలస్యం చేస్తే పర్సంటేజ్ పెరుగుతుందేమో అన్న భయంతో డబ్బులు ఇచ్చేందుకు కాంట్రాక్టర్లు హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. రెండు సంవత్సరాలుగా గ్రేటర్ కార్పొరేషన్‌లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.187 కోట్లు విడుదల చేసింది. వాటికి సంబంధించిన సుమారు రూ. 30 కోట్ల విలువైన చెక్కుల రెవెన్యూ క్లియరెన్స్ కోసం కమీషన్ చెల్లించాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

**అక్కడ.. ఇక్కడ..**

పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో మామూళ్ల పర్వం జోరుగా సాగుతున్నదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు క్లియరెన్స్ కోసం పెద్ద మొత్తంలో చెల్లించుకోవాల్సి వస్తున్నట్లు తెలుస్తున్నది. చెక్కులు రాసినందుకు బల్దియాలో ఫిక్స్ చేసిన పర్సంటేజ్‌తో పాటు చెక్కు క్లియరెన్స్ కోసం రెవెన్యూ శాఖలో ఫిక్స్ చేసిన పర్సంటేజ్ ఇవ్వాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో పర్సంటేజ్‌ల డబుల్ ధమాకా నడుస్తున్నది. బల్దియాలో ఉన్నత స్థాయి నుంచి కింది స్థాయి వరకు కలిపి పర్సంటేజ్‌లు ఫిక్స్ చేసినట్లు తెలుస్తున్నది. ఇలా రెండు చోట్ల పర్సంటేజ్‌లు వసూలు చేస్తుండడంపై కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

# 10 నెలల చిన్నారి కిడ్నాప్

**నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



ఖమ్మం జిల్లాకు చెందిన నిందితులు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 26 : జనగామ జిల్లా కేంద్రంలో 10 నెలల పసికందు కిడ్నాప్ కలకలం సృష్టించింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 163కి సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న పీఎల్‌జీ కన్వెన్షన్‌లో కొంత కాలంగా చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రామ్ జూల్ రజాక్ భార్యతో కలిసి కూలీ పని చేసుకుంటూ అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. వీరి గుడిసెకు పక్కనే ఖమ్మం జిల్లాకు చెందిన సురేశ్, ప్రేమలత దంపతులు మరో గుడిసె వేసుకొని అక్కడే కూలీ పని చేసుకుంటూ ఉంటున్నారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య పరిచయం ఏర్పడి, వారి పిల్లలను ఖమ్మం జిల్లాకు చెందిన దంపతులు బజారుకు తీసుకెళ్లేంత చనువు ఏర్పడింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సురేశ్, ప్రేమలత దంపతులు ఓనర్‌కు చెందిన హీరో హెచ్‌ఎఫ్ డిలక్స్ కంపెనీకి చెందిన బైక్ ఏపీ 36 ఏవీ 2790పై బజారుకు వెళ్లి వస్తామని చెప్పి చత్తీస్‌గఢ్‌కు చెందిన రామ్ జూల్ రజాక్ చిన్న కూతురు అయిన 10 నెలల పసికందు శివానిని తీసుకొని వెళ్లి తిరిగి రాలేదు. వారికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చినట్లు తెలిపారు. రాత్రి వరకూ నిందితులైన దంపతులు పసికందును తీసుకొని రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై ఎస్సై రాజేశ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల ఆచూకీ తెలిసిన వారు 8712685202, 8712 685259, 871 268 5260కు సమాచారం అందించాలని సీఐ దామోదర్‌రెడ్డి ప్రజలను కోరారు.

## నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 26 : చిల్పూరు మండలం నష్కల్ గ్రామానికి చెందిన పాశం రాజు, అపర్ణ దంపతుల కూతురు తపస్వి(4) నీటితొట్టిలో పడి మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అపర్ణ తన పుట్టిల్లయిన స్టేషన్ ఘన్‌పూర్‌లోని స్నేహితురాలి ఇంట్లో బుధవారం జరిగిన శుభాకార్యానికి వెళ్లింది. ఈ నేపథ్యంలో తపస్వి ఆడుకుంటూ వెళ్లి నీటితొట్టిలో పడింది. గమనించిన అపర్ణ వెంటనే పాపను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## ఉరేసుకుని అగ్రికల్చర్ విద్యార్థిని ఆత్మహత్య



రేష్మిత (ఫైల్)

కాశీబుగ్గ, ఫిబ్రవరి 26 : నగరంలోని పైడిపల్లి ప్రాంతంలో ఉన్న వ్యవసాయ కళాశాల లో ఓ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎనుమాముల సీఐ అలె రాఘవేందర్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన గుంటోజు రేష్మిత(19) ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఉదయం తాను ఉంటున్న గది తలుపు తీయకపోవడంతో కాలేజీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా రేష్మిత ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉంది. రాత్రి గదిలో ఆమె ఒంటరిగానే ఉంది. ఇక్కడ చదువుకోవడం ఇష్టం లేదని తెలిసింది. మృతురాలి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## పేలుడు ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 26 : కొత్తవాడలో పేలుడు ఘటనకు కారకులను పోలీసులు గుర్తించారు. ఈ పేలుడు బ్లాక్ మ్యాజిక్ కారణంగా జరిగిందని నిర్ధారణకు వచ్చి అందుకు గల కారకులపై కేసు నమోదు చేశారు. మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. కుమారస్వామి అనే వ్యక్తికి చెందిన ఇంటి నిర్వహణ బాధ్యత మాచర్ల రాజేశ్ చూసుకుంటున్నాడు. అదే ఇంటిలో గతంలో అద్దెకు ఉన్న యాకూబ్‌పాషా ఇల్లు ఖాళీ చేసి, తనకు పరిచయమున్న బాదావత్ వెంకన్నకు దాన్ని అద్దెకు ఇప్పించాడు. మంగళవారం రాత్రి దుష్టశక్తులు దరిచేరకుండా ఉండడానికి యంత్రాన్ని తయారు చేసి ఇస్తామని నమ్మబలికి విచిత్ర ఆకృతిలో ఉన్న నాణెంపై రసాయనాలు పోసి క్షుద్రపూజలు చేసినట్లు నటించి, దాన్ని ప్రత్యేకంగా ప్యాక్ చేసి రాజేశ్‌కు యాకుబ్‌పాషా, వెంకన్న అందించారు. ఈ నాణెం ఇంట్లో ఉన్నంతకాలం మంచి జరుగుతుందని, దీన్ని ఇంట్లో భద్రపరచుకోవాలని నమ్మబలికారు. వారి మాటను నమ్మిన రాజేశ్ దాన్ని ఇంట్లో భద్రపరిచాడు. అయితే, ఒక్కసారిగా నాణెం ప్యాక్ చేసిన బాక్స్ పేలి పెద్ద శబ్దం రావడంతో కంగారుపడిన రాజేశ్ వారిని వెతకగా కనిపించకుండా పోయారు. ఈ మేరకు పోలీసులకు రాజేశ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.



హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో బయలుదేరుతున్న సిబ్బంది

## ఎమ్మెల్సీ పోలింగ్ మెటీరియల్ పంపిణీ

- పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య
- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

హనుమకొండ, ఫిబ్రవరి 26 : హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన వరంగల్ –ఖమ్మం– నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ, మెదక్ –నిజామాబాద్, ఆదిలాబాద్– కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రక్రియను కలెక్టర్ ప్రావీణ్య బుధవారం పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లు, పీవోలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్స్ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం పోలింగ్ బాక్సులను జాగ్రత్తగా సీల్ చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జోనల్ అధికారిని సంప్రదించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సామగ్రి తీసుకొని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రానికి బస్సుల్లో బయలుదేరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రమేశ్ రాథోడ్, నారాయణ పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ షేక్ సలీమా..**



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

వేలేరు : వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వేలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, బుధవారం సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలని, భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలని, ఓటర్లకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మల్లికుదుర్ల గట్టు మల్లిఖార్జున స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఏసీపీ తిరుమల్, ఎస్సై సురేశ్ ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది..**



ఆత్మకూరు : పోలింగ్ కేంద్రంలో సామగ్రితో సిబ్బంది

న్యూస్ నెట్‌వర్క్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. సిబ్బంది పోలింగ్ సామగ్రిని కేంద్రానికి తీసుకువచ్చారు. ఎల్కతుర్తి హైస్కూల్‌లో రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జగత్‌సింగ్ తెలిపారు. కమలాపూర్ బాలికల ఉన్నత పాఠశాలలో పట్టభద్రులకు మూడు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రం కేటాయించారు. భీమదేవరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ప్రవీణ్ తెలిపారు.



కాళోజీ కళాక్షేత్రంలో నాటకోత్సవాల ముగింపు సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సాహితీవేత్తలు

## నాటక కళాకారులను ప్రోత్సహించాలి

- కళా ప్రదర్శనలకు ఉచితంగా వేదిక కేటాయించాలి
- ముగిసిన తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు



‘జనరల్ బోగి’ నాటకంలో ఒక సన్నివేశం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 26 : కళావేదికల ద్వారా ప్రదర్శించే నాటికలు, నాటకాలు ప్రజల ఆదరణ పొందడానికి కళాకారులకు తగిన పోత్సాహం అందించాలని రాష్ట్ర కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహర బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా సదానందం పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో నాటికల ప్రాధాన్యం తగ్గకుండా కళా సంస్థలు, ప్రభుత్వం తగిన చేయూత ఇవ్వాలని కోరారు. కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటులో ఎన్నో వ్యయ ప్రయాసాలకు లోనై అధికారులు, ఇంజినీర్లకు కళాకారులకు కావాల్సిన సౌకర్యాలు, వేదికను ఏర్పాటు చేయడంలో ఎంతో కృషి చేశామన్నారు. అయితే, ప్రతినెలా తమ నాటికలు ప్రదర్శించే విధంగా కళా వేదికను ఉచితంగా అందించాలని కోరారు. అలాగే, కళాక్షేత్రంలో మరిన్ని సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కళాకారుల రిహార్సల్ కోసం ప్రత్యేకంగా ఒక గది, ప్రేక్షకుల కోసం టాయిలెట్స్, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కుందావఝుల కృష్ణమూర్తి, బీ పురుషోత్తమరావు, నేలకొండ భాస్కర్‌రావు, వనం లక్ష్మీకాంతారావు, లక్ష్మణ్‌రావు, ఎన్‌వీఎన్ చారి, నాగిల్ల రామశాస్త్రి, అంపశయ్య నవీన్, జూలూరి నాగరాజు, సీత వెంకట్, ఓడపల్లి చక్రపాణి, నృత్య కళాకారులు, కళాభిమానులు, సాహితీవేత్తలు, కవులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన జనరల్ బోగి నాటకం అందరినీ అలరించింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

WANTED

★ లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# 20 ఏళ్లుగా నిరీక్షణ

- ఇప్పటికీ అందని పరిహారం
- ఐఆర్ఆర్ భూ నిర్వాతుల ఆవేదన
- అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు

వరంగల్, ఫిబ్రవరి 26 : అభివృద్ధికి సహకరించినా సహాయం అందలేదు. 20 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూపులు. రెవెన్యూ కార్యాలయాల మెట్లు ఎక్కుతూ.. దిగుతూ.. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఐఆర్ఆర్ భూ నిర్వాసితులకు ఎదురవుతున్నది నిరాశే. నగరం చుట్టూ నిర్మిస్తున్న ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతుల ఆవేదన ఇది. ఇరవై ఏళ్ల క్రితం నగరంలోని నాయుడు పెట్రోల్ పంప్ జంక్షన్ నుంచి ఖిలావరంగల్, ఎనుమాముల మార్కెట్ రెండో గేట్ మీదుగా కొత్తపేట నుంచి ఆరెపల్లి వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. నాయుడు పెట్రోల్ పంప్ నుంచి ఎనుమాముల మార్కెట్ రెండో గేట్ వరకు 8 కిలోమీటర్లు, అక్కడి నుంచి ఆరెపల్లి వరకు 5 కిలోమీటర్ల భూ సేకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఐఆర్ఆర్ నిర్మాణం కోసం నాయుడు పంపు నుంచి 8 కిలోమీటర్లు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ భూ సేకరణ ప్రక్రియ చేపట్టింది. నాయుడు పెట్రోల్ పంప్ జంక్షన్ నుంచి కట్టమల్లన్న దేవాలయం వరకు సమారు వంద ఎకరాలను సుమారు 500 మంది రైతుల నుంచి సేకరించారు. భూములు కోల్పోయిన రైతులకు కుడా ఆధ్వర్యంలో రూ.120 కోట్లు అందజేశారు. ఇంకా భూములు కోల్పోయిన 60 మంది భూ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. వీరంతా భూ సేకరణ ప్రక్రియ చేపట్టిన నాటి నుంచి కుడా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు పరిహారం అందించలేదు. 20 ఏళ్లుగా సదరు భూ నిర్వాసితులు పరిహారం కోసం ఎదురు చేస్తున్నారు.

**ఇప్పటికైనా పరిహారం చెల్లించేనా?**

ఇన్నర్ రింగ్ రోడ్డు భూ సేకరణ కోసం ప్రభుత్వం ప్రకటించిన రూ. 107 కోట్లు కాకతీయ పట్టణాభివృద్ధి ఖాతాలో ఇటీవల జమయ్యాయి. దీంతో ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం భూములు ఇచ్చి పరిహారం కోసం ఎదురు చూస్తున్న రైతుల్లో ఆశలు చిగురించాయి. 20 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్న రైతులకు వెంటనే పరిహారం చెల్సించాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డు కోసం సేకరించిన వంద ఎకరాల్లో చాలావరకు కుడా నిధులతో పరిహారం చెల్లించారు. ప్రస్తుతం ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో సుమారు 60 రైతులకు పరిహారం చెల్లించేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



రుద్రేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్-రేవతి దంపతులు



శాయంపేట : శివాలయంలో పూజలు చేస్తున్న సిరికొండ మధుసూదనాచారి

# హర హర మహాదేవ.. శంభో శంకర

- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- జిల్లాలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



మెట్టుగుట్టపై క్యూలో భక్తులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 26 : చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. అలంకార్ జంక్షన్, రాగన్నదర్వాజ నుంచి భక్తులు వేచి ఉన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్–రేవతి దంపతులు, సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వద్దిరాజు వెంకటేశ్వర్లు దంపతులు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పాల్గొని రుద్రేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం 6.45 గంటలకు సింహ లగ్నంలో రుద్రేశ్వరీ–రుద్రేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, వద్దిరాజు వెంకటేశ్వర్లు దంపతులు తలంబ్రాలు సమర్పించారు.

**మడికొండ** : మడికొండ మెట్టుగుట్ట శివనామస్మరణతో మార్మోగింది. అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ ఆధ్వర్యంలో స్వయంభూ మెట్టురామలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. జిల్లా జడ్జిలు రమేశ్‌బాబు, గీత, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు–మధుమతి దంపతులు, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ రఘుచందర్ ఉన్నారు.

**ఐనవోలు** : శివనామస్మరణతో ఐలోని పులకించిపోయింది. డైరెక్టర్ జనరల్ అండ్ ఈవో స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ శశాంక్ గోయల్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మల్లికార్జునస్వామిని దర్శించుకొన్నారు. స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహ వాహనసేవ నిర్వహించారు. ఒగ్గు పూజరులు పెద్ద పట్నం వేసిన తర్వాత సంప్రదాయం ప్రకారం గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ అమ్మ వార్లతో స్వామివారి కల్యాణం జరిపించారు. పట్నం తొక్కడం కోసం భక్తులు పోటీలు పడ్డారు.

**భీమదేవరపల్లి, వేలేరు, హనుమకొండ, శాయంపేట** : భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో కైలాస కల్యాణి క్షేత్రంలో పీవీ సోదరుడు పీవీ మదన్‌మోహన్‌రావుతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండ పద్మాక్షి కాలనీలోని సిద్ధేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గట్టు మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శాయంపేట మండలం పెద్ద కోడెపాక గ్రామంలోని శివాలయాన్ని శాసన మండలి బీఆర్‌ఎస్ పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి సందర్శించారు. శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు.



రుద్రేశ్వరీ–రుద్రేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న ఉపేంద్రశర్మ